కథ

# చినుకులు

- నడిమింటి నరసింగరావు

అదో దిక్కుమాలిన ఊరు.
ఎన్నికల ముందు..
'మా పార్టీ గెలిస్తే 'జలయజ్ఞం' శాశ్వతంగా మీ ఊళ్లోనే..' అన్నారు ఓ మంత్రిగారు.
'ఉచిత నీరు – నీటి బదలీ పథకం' అన్నాడు మరో నేత.
'సామాజిక న్యాయం' కింద 'తాగునీరు –సాగు నీరు' ఇస్తానన్నాడు కొత్తగా వచ్చిన ఓ నాయకుడు.
జనం ఆనందించేరు. కాసేపు ఆశల పల్లకీలో ఊరేగారు. ఎన్నికలు అవగానే నాయకులు ఎవరి హామీలు వారు పట్టుకు పోగా.. ఊరికి కరువే మిగిలింది. వానల్లేవు.. తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు.
నేలతల్లి గుండె పగిలి.. పంటల్లేవు.
ఎటుచూసినా కరువు... కరువు.. కరువు.

★★★



వరుణదేవుడి ఆఫీసులో టేబుల్ మీద కాగితం గాలికి రెపరెపలాడుతోంది.

రాత్రి.. ఎన్నికల ముందు ఫ్రీగా వచ్చిన మందులాగ మధువు సేవించి..టీవీలో వచ్చే రియాల్టీ షోల్లాగ .. అప్సరసల డాన్సులు చూసినవే చూసి.. ఉదయం తీరిగ్గా ఆఫీసుకి వచ్చేడు వరుణదేవుడు.

టేబుల్‌మీదున్న కాగితం చదివాడు.

అది దేవేంద్రుడు ఇచ్చిన మెమో...

'జలశాఖా మాత్యులు వరుణదేవునికి..

భూలోకంలో ఎక్కడ చూసినా కరువు తాండవిస్తోంది. అందుకు మీ బాధ్యతా రాహిత్యమే కారణమని – నిఘా విభాగం నివేదికని బట్టి తెలిసింది. ఛానెల్స్ అందించిన సిడీలు కూడా ఆవిషయాన్ని నిర్ధారించాయి.

సంవత్సరంలో నాలుగు నెలలే మీకు పని. అది కూడా మీరు సక్రమంగా చేయలేదు. సైటుకి వెళ్లి వానలు కురిపించాల్సిన మీరు ఆ పని విస్మరించి – బినామీ పేర్లతో 'మినరల్ వాటర్' వ్యాపారం, జలయజ్ఞం కాంట్రాక్టులు చేపట్టినట్టు సమాచారం అందింది.

సైటుకి వెళ్లకపోయినా రెగ్యులర్‌గా టి.ఎ., డి.ఎ.లు మాత్రం క్లెయిమ్ చేస్తున్నారు. చేసే వృత్తిలో నిబద్ధత పాటించకుండా బాధ్యతా రహితంగా ప్రవర్తించిన మీనుంచి సంజాయిషీ కోరడమైనది. వారం రోజుల్లో మీ సమాధానం అందని యెడల క్రమశిక్షణారాహిత్యంగా పరిగణించి సస్పెన్షన్ లేదా టెర్మినేషన్ చర్యలు తీసుకోబడునని తెలి



యజేయడమైనది.

–స్వర్గాధిపతి
దేవేంద్రుడు
కాపీ టు బృహస్పతి
కాపీటు కుబేరుడు
కాపీటు ఆల్ డిపార్ట్‌మెంట్స్...'

మెమో చూడగానే వరుణుడు కోపంతో ఊగిపోతూ అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. అప్పుడే లోపలికి వచ్చేడు వాయుదేవుడు. వరుణుడి చేతిలో కాగితం చూడగానే 'మెమో'అని అర్థమై పోయింది. అయినా బయట పడకుండా 'ఏంటి బాస్.. అంత సీరియస్‌గా వున్నావు. ఏమన్నా ప్రాబ్లెమా' అన్నాడు.

'మన బాస్ .. ప్రేమలేఖ రాసేడు. ఇదిగో చూడు' అని మెమో ఇచ్చేడు వరుణుడు.

వాయుదేవుడు చదివేడు.

వరుణుడు ఆవేశంగా 'మన బాస్‌కి వెయ్యి కళ్లయితే వున్నాయి కాని బ్రెయిన్ మాత్రం లేదు. ఏం రాసేడో చదివేవుగా. సంవత్సరానికి నాలుగు నెలలే పని అట. మధ్యలో తపస్సులు చెడగొట్టడానికని, తుఫానులనీ, వరదలనీ.. స్పెషల్ డ్యూటీలు వేసినప్పుడు వెళ్లడం లేదా! అది మరచిపోయినట్టున్నాడు' అన్నాడు.

'కరెక్ట్‌గా చెప్పేవు బాస్. అయినా సీనియర్ మోస్ట్‌వి. ఆఫ్టాల్ మెమోకి అంత వర్రీ అయిపోతున్నావేంటి. అమృతం తాగిన మనవి పెర్మనెంట్ పోస్టులు. ఇంకెవరూ ఆ కేటగిరీలోకి వచ్చే సమస్యే లేదు. లైట్ తీస్కో. కేంటీన్ కెళ్లి రెండు పెగ్గులు మధువు వేసి వద్దాం పద' అన్నాడు వాయుదేవుడు.

'సారీ. మూడ్ బాగులేదు. నేను రాను' అన్నాడు వరుణుడు.

'దీనికంత ఫీలయిపోతున్నావేంటి బాస్. ఈసారి జనరల్ బాడీ మీటింగ్‌లో బాస్‌ని కడిగి పారేయ్. మనం లేందే బాస్‌లేడు' అని రెచ్చగొట్టేడు గాలిదేవుడు.

'దానికి మళ్లీ మెమో ఇస్తే' డౌట్‌గా అన్నాడు వానదేవుడు.

'ఏంటి బాస్ ఇచ్చేది. నిజం చెప్పాలంటే భూలోకంలో ప్రజలకి నీ మీదున్న భక్తి గౌరవం ఆయన మీద లేవు. నీ రాకకోసం జనం ఎదురు చూస్తారు. నీ పేరున పూజలు.. వరుణ యాగాలు చేస్తారు. కప్పలకి పెళ్లిళ్లు చేస్తారు. మరి మన బాస్‌ని ఎవరైనా పట్టించుకుంటారా.. ఏం మాట్లాడవేం' అని కొంచెం ఎక్కించేడు గాలి.

'కరెక్టే గురూ' ఏదో ఆలోచిస్తూ అన్నాడు వరుణుడు.

'మరో విషయం. మనవి పెర్మనెంట్ పోస్టులు. ఆయనది ప్యూర్లీ టెంపరరీ పోస్ట్. ఏ క్షణాన పదవి పోతుందోనని టెన్షన్. బి.పి.,షుగర్.. అందుకే పొరపాటున ఎవడైనా ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నా తపస్సు అనుకుని అప్సరసలకి ఎమర్జన్సీ డ్యూటీలేసి చెడగొడుతుంటాడు. ఈ అప్సరసల స్కీం ఎక్కువ కాలం పని చెయ్యదని ఆయనకీమధ్య కొత్త భయం పట్టుకుంది. ఎందుకంటే భూలోకంలో చాలామంది హీరోయిన్‌లు 'నువ్వొకటిప్పితే ..నేను రెండిప్పుతా' అని గుడ్డలిప్పి ఒళ్లు దాచుకోకుండా ఆడిపాడుతున్నారు. వాళ్ల ముందు మన అప్సరసలు దిగదుడుపే. అదీగాక, ఇంద్రుడి పోస్ట్ ఎన్నిసార్లు పోలేదు. అలా పోయిన ప్రతీసారి శ్రీమహావిష్ణువో.., మహేశ్వరుడో ఆదుకోబట్టి సరిపోయింది కాని లేకపోతే ఈ పోస్ట్‌లో ఇంతకాలం వుండేవాడా.., రేపు ఇదే పాయింట్ మీద బాస్‌ని ఉతికి ఆరెయ్యి.. నీ మరక మాయం' అని మరింతగా రెచ్చగొట్టేడు వాయుదేవుడు.

'మీరంతా సపోర్ట్ చేస్తే తప్పకుండా అడుగుతాను బాస్' అన్నాడు వరుణుడు.

సపోర్ట్ అన్న మాట వినగానే వాయుదేవుడి ముఖంలో రంగులు మారాయి. అది కనబడనీయకుండా 'పరిస్థితి అంతవరకు రాదులే బాస్. వస్తే అప్పుడు చూద్దాంలే' అని కామ్‌గా సైడ్ అయిపోయాడు వాయుదేవుడు.

'ఉత్త గాలి వాటంగాడు.. ఎక్కడి మాటలు అక్కడ చెప్తుంటాడు..వేస్ట్.. అయినా డ్యూటీ సక్రమంగా చేయలేదనేగా నా మీద అభియోగం.. ఇప్పుడే భూలోకం వెళ్లి కుంభవృష్టి కురిపిస్తాను. నదులు, చెరువులూ, వాగులూ, వంకలూ.. నిండిపోయి. నీటికరువన్నది లేకుండా చేస్తాను. నా సిన్సియారిటీ నిరూపించుకుంటాను'. అని ఓ నిర్ణయానికి వచ్చి భూలోకానికి వెళ్లడానికి బయలుదేరబోయాడు వరుణదేవుడు.

ఇంతలో సెల్ మోగింది.. అటునుంచి శ్రీ మహావిష్ణువు.. 'వరుణా బాగున్నావా?'

'తమరి దయవల్ల బాగానే వున్నాను స్వామీ' వినయంగా చెప్పేడు.

'భూలోకానికి వెళ్తున్నావా?'

'అవును స్వామీ. పని సక్రమంగా చేయడం

లేదని దేవేంద్రుడు మెమో ఇచ్చేడు. అందుకే ఇపుడే బయలుదేరుతున్నాను'

'ఒక్క నాలుగు వారాలు ఆగి బయలుదేరు వరుణా..' అభిమానంగా చెప్పేడు శ్రీహరి.

'అదేమిటి స్వామీ..' వరుణుడిలో ఆశ్చర్యం.

'ఏం లేదు వరుణా.. నా భక్తుడు తీసిన సినిమా ఒకటి రేపు రిలీజవుతోంది. హీరోకి మిగతా హంగులన్నీ వున్నాయి కానీ నటన మాత్రం రాదు. కానీ నటవారసుడు. హీరోని డేట్లు అడిగితే..ఈ సారికి మావాడితో చెయ్యి అన్నాట్ట. ఏం చెయ్యాలేక కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీసేడు. వాన పడితే ఓపెనింగ్స్ దెబ్బతింటాయి. ప్రొడ్యూసర్ పాపర్రై పోతాడు. నిన్నే నాకు స్పెషల్ పూజ చేయించి.., మంత్రాలుకూడా వినపడకుండా ఇదే చెప్పుకొచ్చేడు. భక్తుల కోర్కెలు తీర్చడమే కద భగవంతుడి కర్తవ్యం. కాబట్టి, నీ భూలోకం ట్రిప్ కేన్సిల్ చేసుకో. అవసరమైతే నేను దేవేంద్రుడికి ఫోన్ చేసి చెప్తాను' అని ఫోన్ పెట్టేసాడు.



వరుణుడికి ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

'దేవుళ్లు లోకనాయకులు.. అవతార పురుషులు అయివుండి కూడా ఇంత స్వార్థమా.. ఒక భక్తుడి కోసం అంతమంది ప్రజలని బాధపెట్టడమా? వీల్లేదు. అలా జరగడానికి వీల్లేదు. పోస్ట్ పోయినా సరే వెంటనే భూలోకం వెళ్లి కురిసి వస్తాను' అనుకుని ఆవేశంగా బయలుదేరబోయాడు,.

మళ్లీ సెల్ మోగింది. ఈసారి పరమశివుడు లైన్లోకి వచ్చేడు. డైరెక్టుగా పాయింట్లోకి వస్తూ శివుడు 'వరుణా.. భూలోకంలో నా భక్తుడొకడు 'సెజ్'ల పేరుతో కారుచౌకగా భూములు కొనేసి 'భోగన్‌విల్లా' అని లక్జరీ ఎపార్ట్‌మెంట్‌లు కడుతున్నాడు.రేపు స్లేబ్ వేస్తున్నాడు. అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. వాన పడితే మొత్తం అప్‌సెట్ అవుతుంది. నిన్న అభిషేకం చేయించినంతసేపూ అదే చెప్పుకొచ్చేడు. కాబట్టి ఓ వారం రోజులపాటు నువ్వు భూలోకం వెళ్లకు. స్లేబ్ అయ్యేక వాటరింగ్ అవసరం కాబట్టి అప్పుడు వెళ్లి కురవచ్చు. ఇది చెప్పడానికే ఫోన్ చేసాను. నిన్న అభిషేకం చేసిన కొబ్బరి చిప్పలు నంది చేత పంపిస్తాను. ఉంటాను మరి' అని సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా ఫోన్ పెట్టేసాడు.

కిరీటం తీసి కాసేపు జుత్తు పీక్కున్నాడు వరుణుడు. కంచే చేనుమేస్తే సామెత గుర్తొచ్చింది. హరిహరులిద్దరూ భూలోకం వెళ్లద్దంటున్నారు. వెళ్లాలా. వద్దా.. అని సందిగ్ధంలో పడ్డాడు.

కేవలం ఇద్దరు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం కర్తవ్యాన్ని విస్మరించడం అన్యాయం. ఎవరెన్ని చెప్పినా ఆగే ప్రసక్తే లేదు. వెళ్లి కురిసే వస్తాను అనుకుని దృఢ నిశ్చయంతో బయలుదేరబోతుంటేమళ్లీ ఫోను.

త్రిమూర్తులలో ఇద్దరు అయ్యేరు. ఈసారి బ్రహ్మదేవుడు అయివుంటాడు. ఈయన కూడా ఏదన్నా ఆబ్లిగేషన్ పెడితే మళ్లీ అదో గొడవ. అందుకే మాట్లాడ దలుచుదలుచుకోలేదు. సెల్ మోగుతూనే ఉంది. బహుశా ఇంటినించేమో అని డౌటొచ్చింది. భూలోకం వెళితే నెలరోజుల వరకూ తిరిగి వచ్చే ప్రసక్తే లేదు. కనీసం ఆ విషయమైనా వాళ్లకు చెప్పాలి అని జేబులోంచి సెల్ తీశాడు. అటునుంచి దేవేంద్రుడు.

'వారం రోజుల్లో ఆడిటింగ్ వుంది. మిగతా పన్లన్నీ పక్కన పెట్టి ఎకౌంట్స్ ఫైనలైజ్ చెయ్యండి. గుర్రం గుడ్డిదైనా దానా తప్పదని మీ జీత భత్యాలు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు చెల్లిస్తూనే వున్నాం. మీరు పని ఎలాగూ చెయ్యరు. బృహస్పతి గారు వచ్చేసరికి ఎకౌంట్స్ అయినా ఫైనలైజ్ చేసి వుంచండి..' అని ఫోన్ కట్ చేసాడు.

అనవసరంగా ఫోన్ తీసానని బాధపడ్డాడు వరుణుడు.

ఒక్కసారి భూలోకంలోకి తొంగి చూసేడు.

***

అదే దిక్కుమాలిన ఊరు.

ఎలక్షన్లో గెలిచిన వాడూ పట్టించుకోలేదు.

ఓడిపోయిన వాడు ఎలాగూ పట్టించుకోడు.

ఫలితం..

ఎప్పటిలాగే వానల్లేవు...పంటల్లేవు.. తినడానికి తిండిలేదు. తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు.

ఇవన్నీ తెలియని ఓ చిన్నపిల్ల తల్లి దగ్గరకి వచ్చి 'అమ్మా.. ఆకలేస్తోంది.'అంది.

ఆ మాటకి తల్లి ఒంట్లో మిగిలిన కాసింత నెత్తురూ కన్నీరై రెండు చినుకులుగా రాలి పడింది. అది చూసిన ఆ పిల్ల 'వాన ఇలాగే పడుతుందామ్మా' అని తల్లిని అడుగుతుంటే – వరుణదేవుడి మనసు కలుక్కుమంది.

*

చిరునామా:
నడిమింటి నరసింగరావు
శ్రీసాయిరాం గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్
ఫ్లాట్ నం 406, బ్లాక్ – 1
యూసఫ్ గుడ, హైదరాబాద్–500038

## శ్రియ దైవభక్తి

అందాల తార శ్రియకి దైవభక్తి ఎక్కువైనట్లుంది. అందులో భాగంగానే ఇటీవల తిరుపతి శ్రీవేంకటేశ్వరుని దర్శనం చేసుకొంది. త్వరలో విడుదల కాబోతున్న తన కొత్త చిత్రాలు విజయవంతం కావాలని కోరుతూ వేంకటేశ్వరుని దర్శించుకొని ఉండవచ్చని పలువురు అంటున్నారు. కొద్దికాలంగా బాలీవుడ్, కోలీవుడ్ వైపు తప్ప టాలీవుడ్ వైపు చూడని శ్రియ తాజాగా రెండు తెలుగు చిత్రాలను అంగీకరించింది. 'మల్లన్న'లో విక్రమ్ సరసన నటిస్తున్న సంగతి విదితమే! అలాగే శ్రియ నటించిన 'పిస్తా' అతి త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.